

ఇస్కాన్‌లో రాధాపార్థసారథులకు అలంకరణ..



కన్నయ్యా.. చల్లగా చూడయ్యా..!



మందిరంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు..




రాధాకృష్ణుల దర్శనం కోసం క్యూ..





భక్తులతో ఇస్కాన్ కిటకిట







కృష్ణం వందే జగద్గురుమ్..

వసుదేవ తనయా..! వందనం

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
భక్తులతో కిటకిటలాడిన ఇస్కాన్ మందిరం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కృష్ణ మందిరాలతో పాటు జిల్లాకేంద్రంలోని ఇస్కాన్ మందిరాలకు ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. అనంతపురం సివారులోని ఇస్కాన్ మందిరంలో ఉదయం విశ్వశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, సాయంత్రం ఉట్టికొట్టే ఉత్సవం, అనంతరం రాధా పార్థ సారథులకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తాత్కాలిక కొలనులో కన్నయ్యకు తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో మూల మూర్తులకు మహాభిషేకం అనంతరం పుష్పాభిషేకం గావించారు. పలు ప్రాంతాల్లో తమ చిన్నారులకు చిన్నారి కృష్ణుడు, గోపెమ్మల వేషధారణ చేయించి తల్లిదండ్రులు మురిసి పోయారు.

- అనంతపురం కల్చరల్















హే.. కృష్ణా..

రాత్రి గస్తీ పెంచండి: ఎస్పీ

అనంతపురం క్రైం,ఆగస్టు 26: జిల్లాలో రాత్రి వేళ గస్తీలు పెంచి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. దీంతో పోలీసులు ఏటీఎం సెంటర్లు, బ్యాంకుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల ఏటీఎం సెంటర్ల జాబితా సిద్ధం చేసి ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. సెక్యూరిటీగార్డులు, సీసీ కెమెరాలు తప్పని సరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు రంగంలోకి దిగారు.

డెంగీతో చిన్నారి మృతి



కౌసర్ (ఫైల్)

కణేకల్లు, ఆగస్టు 26: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన పింజరి ముజ్బా కౌసర్(9) డెంగీతో సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పింజరి పీరావలి కుమార్తె అయిన కౌసర్‌కు గత మూడు రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో బళ్లారి ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు కౌసర్‌కు డెంగీగా నిర్ధారించి చికిత్స అందించారు. అయితే సోమవారం ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో కౌసర్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. చిన్నారి కౌసర్ కణేకల్లులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తుండటంతో దోమలు వ్యాప్తి చెంది, తన కుమార్తె ప్రాణం పోవడానికి కారణమయ్యాయని తండ్రి పీరావలి వాపోయాడు.

జీడిపల్లికి 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 26: మండ లంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీ నీవా అధికారులు సోమవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.332 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 26: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,500లు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 377టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేటి నుంచి టమోటా కొనుగోలు

మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి

అనంతపురం రూరల్, ఆగస్టు 26: మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమోటా కొనుగోలు చేస్తామని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు టమోటా నాణ్యత తగ్గిందని, దీంతో ధరలు తగ్గినట్లు ప్రభుత్వం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం మంగళవారం నుంచి టమోటా కొనుగోలు చేస్తుందని తెలిపారు. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతు బజార్లకు తరలించి విక్రయిస్తామని తెలిపారు. ధర తగ్గిందని టమోటా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.

గాలిలో గురువులు

- ప్రాజెక్టు నుంచి రీప్యాట్రియేషన్
- 27 రోజులుగా రీ పోస్టింగ్ లేదు
- కలెక్టర్‌కు ఫైల్ పంపిన డీఈఓ
- ఎస్ఎస్ఏలో అటకెక్కిన దరఖాస్తులు
- విద్యాశాఖ, ప్రాజెక్టులో గందరగోళం



అనంతపురం విద్య, ఆగస్టు 26: బడికి వెళ్లాల్సిన ఉపాధ్యాయులను డీఈఓ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. పాఠాలు బోధించాల్సిన గురువులు 27 రోజులుగా పని లేకుండా ఇంటికి.. ప్రభుత్వ కార్యాలయాలకు తిరుగున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి కలెక్టర్ రీప్యాట్రియేషన్ (మునుపటి స్థానానికి పంపడం) చేసిన టీచర్ల పరిస్థితి ఇది. కొత్తగా ప్రాజెక్టులోకి రావాలనుకున్న వారి పరిస్థితి సైతం ఇలాగే ఉంది. పోస్టుల భర్తీకి 110 దరఖాస్తులు వచ్చాయి. వాటిని స్క్రూటినీ చేయకుండా పక్కన పెట్టేశారు. ఫలితంగా విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో పాలన గందరగోళంగా తయారైంది. జిల్లా విద్యాశాఖ, కలెక్టరేట్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది.



ప్రాజెక్టు కార్యాలయం



డీఈఓ ఆఫీస్

బడి లేదు.. ప్రాజెక్టూ లేదు..

ప్రాజెక్టు నుంచి రీప్యాట్రియేషన్ తరువాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్న టీచర్లకు డీఈఓ వెంటనే రీ పోస్టింగ్ ఇవ్వాలి. అపాయింటింగ్ అథారిటీ డీఈఓనే. కానీ ఈ చిన్న పనిని సైతం డీఈఓ కలెక్టర్‌మీదకు తోసేసినట్లు తెలుస్తోంది. పోస్టింగ్ ఇచ్చే అధికారం తనకు ఉన్నా.. ఫైల్‌ను కలెక్టర్‌కు పెట్టడంతో ఈ సమస్య నానుతూనే ఉంది. తన పనుల్లో కలెక్టర్ బిజీగా ఉండటంతో ఈ సమస్య మరుగున పడింది. డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకుని 27 రోజులు గడిచింది. పాఠశాలకు వెళ్లలేక, ప్రాజెక్టులో పనులు చేయలేక ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పోస్టింగ్ ఇచ్చి ఉంటే బడికి వెళ్లి పాఠాలు చెప్పేవారు. విద్యార్థులకు మేలు జరిగేది. ప్రాజెక్టులో ఉన్నా.. అక్కడి పనులు చూసుకునేవారు. దిక్కుతోచక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

గత నెలలో రీప్యాట్రియేషన్..

జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను గత నెల 31న కలెక్టర్ రీప్యాట్రియేషన్ చేశారు. ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్, అసిస్టెంట్ అలెస్కో గోవింద్ రెడ్డి, అసిస్టెంట్ ఐఈడీ షమ, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాంప్రసాద్ ఈ జాబితాలో ఉన్నారు. ప్రాజెక్టు నుంచి అందరూ వెళితే సమస్య అని ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్‌ను కొంతకాలం అక్కడే పనిచేసేలా మినహాయింపు ఇచ్చారు. రీపాట్రియేషన్ అయిన అసిస్టెంట్ ఐఈడీ షమ అనంతపురంలోని ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయ్యారు. తన సొంత జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారు. మిగిలిన ఐదుగురు టీచర్లు సైతం ఈ నెల 1వ తేదీనే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరిని వెంటనే పాఠశాలలను కేటాయిస్తూ (రీ పోస్టింగ్) ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ ఆ దిశగా చర్యలు లేవు.

కొత్త వాళ్లకు దారేది..?

ప్రాజెక్టులో పనిచేస్తున్న వారిని రీప్యాట్రియేషన్ చేసిన కలెక్టర్.. కొత్తవారితో భర్తీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఔత్సాహిత టీచర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 9వ వరకూ ప్రాజెక్టు అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. 32 మంది ఉపాధ్యాయుల నుంచి 110 అప్లికేషన్లు వచ్చాయి. కానీ ఇప్పటి వరకూ వాటి స్క్రూటినీ చేయలేదు. పాతవారు వెళ్లిపోయారు. కొత్త వారి దరఖాస్తులు మూలన పడ్డాయి. దీంతో వెళ్లిపోయిన సెక్టోరియల్ అధికారుల పని ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు, ఇతర సిబ్బందిపై పడుతోంది. ఫలితంగా ప్రాజెక్టు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పాలన గందరగోళంగా తయారైంది. విద్యాశాఖ అధికారి నిర్ణయాలపై ఉపాధ్యాయులు, సంఘాల నేతలు, ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

వర్షాలకు కుళ్లిన మిరప!

పంటను దున్నేసిన రైతులు
నెల వ్యవధిలో రెండో విత్తనం
కంది రైతులదీ అదే పరిస్థితి



పూర్తిగా కుళ్లిన మిరప పొలం



మళ్లీ మిరప విత్తనం వేస్తున్నరైతులు



రైతులు సిద్ధంగా ఉంచిన మిరప విత్తనాలు

విడపనకల్లు, ఆగస్టు 26: సాగునీటి వనరుల కింద సాగుచేసిన పంటలు భారీ వర్షాలకు కుళ్లిపోయాయి. దీంతో రైతులు పంటను తొలగించి.. మరోసారి విత్తనం వేస్తున్నారు. గుంతకల్లు బ్రాంచ్ కాలువ, హెచ్ఎల్‌సీ, బోరు బావుల కింద ఉరవకొండ నియోజక వర్గ పరిధిలో జూలైలో వేల ఎకరాల్లో మిరప, కంది, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ఇటీవల వారం రోజులు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురువటంతో పొలాల్లో తేమ ఎక్కువైంది. వేరుకుళ్లు ఆశించడంతో మొక్కలు కుళ్లిపోయాయి. దీంతో గత్యంతరం లేక పంటను తొలగిస్తున్నారు. విడపనకల్లు మండలంలో వందల ఎకరాల్లో మిరప మొక్కలను ట్రాక్టర్లు, ఎద్దుల గుంటకలతో దున్నించారు. తేమ ఆరిపోతుందని మరుసటి రోజే నుంచే తిరిగి మిరప విత్తనం వేస్తున్నారు.

భారీగా నష్టం

జూలైలో మిరప సాగు చేస్తే దిగుబడి బాగా ఉంటుంది. తాజాగా పంటను తొలగించడంతో ఈసారి దిగుబడి నెల ఆలస్యంగా వస్తుంది. దీంతోపాటు దిగుబడి భారీగా తగ్గుతుంది. మిరప సాగుకు ఎకరానికి రూ.25 వేలు ఖర్చు చేశారు. రెండోసారి సాగుకు ఎకరానికి రూ.10 వేల దాకా వస్తుందని రైతులు అంటున్నారు. పంట కుళ్లిపోవడంతో ఒక్కొక్క రైతు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకూ పెట్టుబడి నష్టపోయారు. వర్షాల కారణంగా పంట పొలాల్లో కలుపు విపరీతంగా పెరిగింది. తొలగించడానికి సాధ్యం కాదని తెలిసి.. పంటను దున్నేస్తున్నారు.

వేలాది ఎకరాలు..

గడిచిన నాలుగు రోజుల్లో జీబీసీ కింద విడపనకల్లు, ఆర్ కొట్టాల, హావళిగి, డొనేకల్లు, గడేకల్లు, జనార్దనపల్లి, పొలికి, వజ్రకరూరు మండలంలో హంద్రీనీవా ఆయకట్టు రైతులు, ఉరవకొండ మండలంలోని వివిధ గ్రామాల రైతులు వేల ఎకరాల్లో మిరప పంటను దున్నేశారు. రెండోసారి మిరప నారు సాగు చేశారు. కొందరు రైతులు మిరప విత్తనాన్ని విత్తితే, మరికొందరు నర్సరీల్లో నారు కొని తెచ్చి నాటు వేస్తున్నారు.

దెబ్బతిన్న కంది

భారీ వర్షాలకు కంది పైరు పూర్తిగా దెబ్బతినింది. మొక్కలు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన పవన్ కుమార్ 20 ఎకరాల్లో సాగు చేసిన కంది పైరు పూర్తిగా పసుపు రంగులోకి మారింది. దీంతో తేమ ఆరిన అనంతరం పైరును తొలగించి జొన్న లేదా పప్పుశనగ సాగు చేస్తానని బాధిత రైతు తెలిపారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, వజ్రకరూరు, రాగలపాడు తదితర గ్రామాల పరిధిలోనూ కంది పైరు తేమ ఎక్కువై కుళ్లిపోయింది.



పసుపు రంగులోకి మారిన కంది పైరు

పది ఎకరాల్లో కుళ్లిపోయింది..



జూలైలో పది ఎకరాల్లో మిరప సాగు చేశాను. మొలకెత్తిన రోజు నుంచి ఒకటే వర్షం. పంట మొత్తం కుళ్లిపోయింది. చేసేది లేక ట్రాక్టర్‌తో దున్నేశాను. మళ్లీ మిరప పంటనే సాగు చేస్తున్నాను. వేరే పంటలు వేసినా అంతగా లాభం ఉండదు. లాభమో.. నష్టమో.. మిరపనే నమ్ముకుంటున్నాను. ఇప్పటికే రూ.2 లక్షలు నష్టం వచ్చింది.

- పురుషోత్తం, ఆర్ కొట్టాల

పూర్తిగా కుళ్లిపోయింది..



అధిక వర్షాలకు మిరప మొక్కలు పూర్తిగా కుళ్లిపోయాయి. అధిక తేమకు వేరు కుళ్లు తెగుళ్లు సోకటంతో 5 ఎకరాల్లో పంట దెబ్బతిని లక్షల్లో నష్టపోయాను. మిరప పంటతో ప్రతి ఏటా నష్టపోతున్నాం.

- మద్దిపాట్ల శ్రీనివాసులు, ఆర్.కొట్టాల

కౌలుకు తీసుకుని..



ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని జూలైలో మిరప విత్తనం వేశాను. వారం రోజులపాటు కురిసిన వర్షాలకు మొత్తం పంటంతా కుళ్లిపోయింది. గడ్డి కూడా విపరీతంగా పెరిగింది. దిక్కుతోచక కాడెద్దులతో దున్నేశాను. మళ్లీ మిరప పంటనే సాగు చేశాను. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.30 వేలు ఖర్చు అయింది.

- కె.హరికృష్ణ, ఆర్ కొట్టాల

ఒక్క మొక్కా మిగల్లేదు..



ఐదు ఎకరాల్లో మిరప సాగు చేస్తే ఒక్క మొక్క కూడా మిగల్లేదు. చిన్న పైరు కావటంతో వర్షపు నీరు నిలిచి కుళ్లిపోయింది. వాటిని కాపాడు కోవటం కంటే దున్నేయడం మంచిది. అందుకే దున్నేసి మరో సారి మిరపనే సాగు చేశాను. గత ఏడాది చివరిలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ సారి మొదట్లోనే నష్టపోయాం. - భోగేశ్వరాచారి, ఆర్ కొట్టాల

ఘోరం

- బీసీ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి
- మెడకు గాయాలు లేవు.. కాలిపై ఎవరిదో సెల్ నంబర్
- ఆత్మహత్య కాదని విద్యార్థి తండ్రి అనుమానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ఓ విద్యాకుసుమం రాలిపోయింది. నగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్ విద్యార్థి తేజ(17) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన లింగమయ్య కుమారుడు తేజ నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బీసీ బాయ్స్ కాలేజీ హాస్టల్‌లో వసతి పొందుతున్నాడు. హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో కడ్డీకి సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని కనిపించాడు. తేజ మంచివాడని, ఎవరితోనూ గట్టిగా మాట్లాడేవాడు కాదని సహ విద్యార్థులు అంటున్నారు. వారంక్రితం నుంచి తన ఆరోగ్యం


కన్నీటి పర్యంతమవుతున్న విద్యార్థి తండ్రి లింగమయ్య

బాగాలేదని అన్నారు. విద్యార్థి ఉరివేసుకున్నా.. గొంతుపై ఎలాంటి గాయాలు లేవు. విద్యార్థి కాలిపై ఒక మొబైల్ నంబర్ ఉంది. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని హాస్టల్ వార్డెన్, బీసీ సంక్షేమశాఖ అధికారులు అంటున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి లింగమయ్య స్వగ్రామం నుంచి వచ్చాడు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న తన కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. ఏదో జరిగిందని, తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కన్నీరు మున్నీరయ్యాడు. న్యాయం చేయాలని అధికారులకు విన్నవించాడు. కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి కారణమేమిటో తెలుస్తుందని నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ అన్నారు. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సోమవారం రాత్రి నిరసనకు దిగాయి. విద్యార్థి ఆరోగ్యం బాగాలేకపోయినా, ఎవరో కొడుతున్నా హాస్టల్ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అధికారులు నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు.


విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, కలెక్టర్, ఎమ్మెల్యే శ్రావణి

విమానాశ్రయం కావాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ బృందం సభ్యులు

కూడేరు, ఆగస్టు 26: జిల్లాలో రైతులు పండించిన పండ్లను ఎగుమతి చేయడానికి కూడేరు మండలంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను వారు సోమవారం పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల పంటలు పండించినా గిట్టుబాటు ధర, మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే రైతులు తమ పంటలను కార్గో విమానాల ద్వారా మంచి ధర ఉన్న ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు జిల్లా కేంద్రానికి అనుకుని, ప్రభుత్వ భూమి అధికంగా ఉన్న కూడేరు మండలం అనువుగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకొని మెగా డ్రిప్ పథకం అమలు చేసి, రైతుల ఆశలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ బృందం సభ్యులు మల్లికార్జు న, నారాయణ స్వామి, రాజారెడ్డి, సంజీవయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జున, పార్వతీ, పెరుగుసంగప్ప, మండల కార్యదర్శి నాయణమ్మ, రమణ, రమణప్ప, శ్రీరాములు, కాశీంపీరా, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

- ఆస్పత్రికి మంత్రి రాకతో రద్దీ
- అంబులెన్స్‌ను పట్టించుకోని వైద్యులు, సిబ్బంది
- ప్రాణాలు వదిలిన ముదిగుబ్బవాసి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: సర్వజన వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి సవిత.. సోమవారం రాత్రి ఆస్పత్రికి వచ్చారు. అత్యవసర చికిత్స విభాగంలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం సహ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడారు. ఆ తరువాత మీడియాతో మంత్రి మాట్లాడారు. ఇదే సమయంలోముదిగుబ్బకు చెందిన వెంగముని(45) ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ.. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి రెఫర్‌పై అనంతపురం సర్వజన వైద్యశాలకు వచ్చాడు. అత్యవసర విభాగం వద్ద మంత్రి రాక కారణంగా రద్దీ ఉండటం, వైద్యులు అందరూ మంత్రి వద్ద ఉండటంతో అంబులెన్స్‌లో ఉన్న వెంగముని గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వెంగముని అంబులెన్స్‌లోనే మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల తీరుపై మండిపడ్డారు. మంత్రి సవిత, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు ఒకేసారి ఆస్పత్రికి రావడంతో రద్దీ ఏర్పడింది. వీరి రాకకోసం విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించకుండా అత్యవసర విభాగంలోనే ఉంచారని, ఇది కూడా వెంగముని మృతికి కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి.

న్యాయం చేస్తాం: మంత్రి సవిత

హాస్టళ్లో మృతి చెందిన విద్యార్థి తేజ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఆమె విద్యార్థి తేజ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లోని సహచర విద్యార్థులు, తండ్రి లింగమయ్యతో వివరాలు ఆరా తీశారు. ఇందుకు తండ్రి లింగమయ్య కాళ్లు తిమ్మిర్లు ఉన్నాయంటూ ఇంటికి వచ్చాడని.. అందుకు వైద్యం చేయించి పంపామని తెలిపాడు. నా కొడుకు ఇలా చనిపోతాడని అనుకోలేదు, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు అని అన్నాడు. మంత్రి వైద్యులు పిలిపించి విద్యార్థి వాడిన మందులను పరిశీలించారు. అనంతరం వార్డెన్ ఈరన్నను పిలిపించి ఆరా తీశారు.


అంబులెన్స్‌లో మృతిచెందిన వెంగముని, విలపిస్తున్న కుటుంబ సభ్యులు

30న యూటీఎఫ్ నిరసనలు

అనంతపురం విద్య, ఆగస్టు 26: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 30న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన తెలుపనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో కేంద్రప్రభుత్వం కొత్త స్కీంను తీసుకురావడాన్ని జిల్లా యూనియన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్రం తేవాలనుకుంటున్న యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 30న నిరసనలు తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి: ఎంపీ

అనంతపురం అర్బన్, ఆగస్టు 26: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చ ర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎస్పీ జగదీష్‌ను కో రారు. సోమవారం స్థానిక పోలీసు అతిథి గృహంలో ఎస్పీని ఎంపీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతపురంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సిబ్బందిని పెంచాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఫిలాటెలీ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

- తపాలాశాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: తపాలా బిళ్లల సేకరణపై విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాల్ స్పర్శ్ యోజన ఫిలాటెలీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ సూపరింటెండెంట్ గుంపస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఆరు నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పరీక్షకు అర్హులన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఎస్సీఎస్టీలకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పిస్తారన్నారు. ఈ పరీక్ష రెండు విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. ఈ రెండు విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన వారికి రూ. 6 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ, స్కూల్ ప్రిన్సిపాళ్ల ద్వారా గానీ ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ రూ. 200తో అనంతపురంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రారంభించాలన్నారు. వివరాలను అప్లికేషన్‌కి జతచేసి పోస్టుమాస్టర్ జనరల్ కర్నూల్ రీజియన్ కర్నూలు 518002కు పంపాలన్నారు. విద్యార్థులు పంపే కవరుకు ఫిలాటెలీ స్టాంపును అతికించి స్పీడ్ పోస్టు ద్వారా పంపాలన్నారు. ఒక కవర్లో ఒక అప్లికేషన్ మాత్రమే పంపాలన్నారు. సెప్టెంబరు 16లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు అనంతపురం డివిజనల్ పోస్టాఫీసును సంప్రదించాలన్నారు.

కుర్చీలపై చర్చ

డ్వామా, డీఆర్‌డీఏ పీడీల నియామకంపై వీడని సస్పెన్స్



అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: జిల్లాలో కీలక శాఖలైన డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు పీడీల నియామకంపై సస్పెన్స్ కొనసాగుతోంది. జైళ్లశాఖ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి డ్వామా పీడీగా వచ్చి ఐదేళ్ల కాలం కావస్తోంది. డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా చేసిన నరసింహారెడ్డి వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఎవరికైనా ప్రభుత్వం బాధ్యతలు అప్పగిస్తే రిలీవ్ కావడానికి సిద్ధంగా ఉన్నారు. ఇద్దరు పీడీలు వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈక్రమంలోనే టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు కావస్తున్నా కీలక శాఖలకు పీడీలను నియమించలేకపోతున్నారనే అసంతృప్తి కూటమి శ్రేణులు, అటు ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

డ్వామా పీడీగా రామాంజనేయులు?

ప్రస్తుతం అందరి చూపూ డ్వామా పీడీ నియామకంపై పడింది. డ్వామా పీడీగా అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు వస్తారంటూ ప్రచారం ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధితో ఉన్న అనుబంధం రామాంజనేయులు నియామకానికి అడ్డంకిగా మారిందని సమాచారం. డీఎల్‌డీఓ రామాంజనేయులు వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్‌ల ఈడీగా, శ్రీసత్యసాయి జిల్లా డ్వామా పీడీగా పని చేశారు. వైసీపీ పాలనలో కీలక పోస్టుల్లో పనిచేసిన రామాంజనేయులును డ్వామా పీడీగా నియమిస్తారనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో అందరి దృష్టి ఆయనపై పడింది. డ్వామాలో ఏపీడీగా ఉన్న సుధాకర్‌రెడ్డి పీడీగా వస్తారనే ప్రచారం కూడా ఉంది. డ్వామాలో ఉపాధి హామీ పథకం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంపీడీఓ శైలజ కూడా పీడీ పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ శాఖలో ఏడీగా పనిచేస్తున్న అల్తాఫ్ కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఎవరికి వారు కూటమి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలోని పెద్దలు, రాష్ట్రస్థాయి అధికారుల ద్వారా డ్వామా పీడీగా రావాలని ప్రయత్నిస్తున్నారు.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఎవరో?

జిల్లాలో కీలక శాఖల్లో డీఆర్‌డీఏ-వెలుగు ఒకటి. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా పనిచేసిన ఎంపీడీఓ నరసింహారెడ్డి కూటమి అధికారంలోకి రాగానే సెలవుపై వెళ్లారు. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. అంతలోనే డీఎల్‌డీఓగా ఉన్న ఓబుళమ్మను ఎఫ్ఏసీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఓబుళమ్మకు తాజాగా జడ్పీ సీఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈమె ప్రస్తుతం జడ్పీ సీఈఓగా, డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా, డీఎల్‌డీఓగా, స్వీప్ స్పెషల్ ఆఫీసర్‌గా, మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఐదు పోస్టులలో పనిచేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు కలెక్టర్ వినోద్ కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్యకు అప్పగిస్తారా లేక కొత్త వారిని నియమిస్తారా అనేది సస్పెన్స్‌గా నిలుస్తోంది. గతంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన డీఎల్‌డీఓ శ్రీనివాసులు, సహకార శాఖలో పనిచేస్తున్న నారాయణస్వామి డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా వస్తారనే ప్రచారం జరుగుతోంది.

సబ్సిడీ ధర ఖరారు

నేటి నుంచి ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్, ఆగస్టు 26: ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా కోసం సోమవారం టెండర్లు ఖరారు చేశారు. అలాగే సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. అన్ని విత్తనాలకు 80 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఎప్పుడో..? అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో సాగు చేయలేకపోవడంతో జిల్లాకు 27907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21791 క్వింటాళ్లు , పెసలు 1501, అలసంద 3253, జొన్న 973, కొర్ర 369 , మినుములు 20 క్వింటాళ్లను కేటాయించారు.


గుత్తిలో ప్రాసెసింగ్ చేసిన ప్రత్యామ్నాయ విత్తనాలు

నేటి నుంచి రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి ప్రత్యామ్నాయ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, గుత్తి, బెళుగుప్ప, ధర్మవరం,కదిరి ప్రాంతాల్లోని యూనిట్లల్లో ప్రత్యామ్నాయ విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ సోమవారం ఆరంభమైనట్లు ఏపీసీడ్స్ అధికారులు పేర్కొన్నారు. మరో మూడు రోజుల్లో విత్తన పంపిణీ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సబ్సిడీ ధరలు ఖరారు ఇలా..

విత్తన రకం	పరిమాణం	పూర్తి ధర	సబ్సిడీధర	రైతు వాటా
పెసలు	4 కేజీలు	13000	10400	2600
మినుములు	4 కేజీలు	14000	11200	2800
కొర్ర	2 కేజీలు	8740	6992	1748
జొన్న	3కేజీలు	700	560	140
ఉలవలు	10 కేజీలు	8700	6960	1740
అలసంద	8 కేజీలు	11300	9040	2260

ఎకరాల వారీగా ప్యాకెట్ల పంపిణీ

ప్రత్యామ్నాయ విత్తనాలను ఎకరాల వారిగా పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఉలవలు (10 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1 ప్యాకెట్, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.

- అలసంద (8 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- మినుములు, పెసలు (4 కేజీల ప్యాకెట్) అర ఎకరా దాకా 1 ప్యాకెట్, ఎకరా దాకా 2, 1.5 ఎకరా దాకా 3, 2 ఎకరాల దాకా 4, 2.5 ఎకరాల దాకా 5, 3 ఎకరాల దాకా 6, 3.5 ఎకరాల దాకా 7, 4 ఎకరాల దాకా 8, 4.5 ఎకరాల దాకా 9, ఐదు ఎకరాల దాకా 10 ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- కొర్ర 2 కేజీల ప్యాకెట్ అర ఎకరా నుంచి ఎకరా దాకా 1 ప్యాకెట్, 1.5 ఎకరాల నుంచి రెండు ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి ఐదెకరాల దాకా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.
- జొన్న (3 కేజీల ప్యాకెట్) అర ఎకరా నుంచి ఎకరా దాకా 1, 1.5 ఎకరాల నుంచి 2 ఎకరాల దాకా 2, 2.5 ఎకరాల నుంచి 3 ఎకరాల దాకా 3, 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల దాకా 4, 4.5 ఎకరాల నుంచి 5 ఎకరాల దాకా ఐదు ప్యాకెట్లు అందజేస్తారు.

పీఆర్‌లో సజావుగా బదిలీ కౌన్సెలింగ్


బదిలీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

అనంతపురం సిటీ, ఆగస్టు 26: రాయలసీమ జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయంలో సజావుగా జరిగింది. ఆ ఆశాఖ ఈఎన్‌సీ బాలూనాయక్ ఆయా జిల్లాల ఎస్‌ఈలతో కలిసి ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదట చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన డీఈఈల కౌన్సెలింగ్ నిర్వహించారు. తర్వాత జిల్లాల వారిగా జేఈ(ఏఈఈ), ఏఈ, టీఓ , ఏటీఓ, జేటీఓ, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బందిని బదిలీలు చేశారు. నాలుగు జిల్లాలకు చెందిన పీఆర్ ఉద్యోగులు ఒక్కసారిగా కౌన్సెలింగ్ ప్రక్రియకు తరలిరావడంతో స్థానిక ఆశాఖ కార్యాలయం కిటకిటలాడింది.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, ఆగస్టు 26: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 3450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు


కసరత్తు చేస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ఉద్యోగుల బదిలీ చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ తెలిపారు. ఉద్యోగుల బదిలీలపై సోమవారం సోమవారం ఆమె డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో కసరత్తు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వివరాలు ఇప్పటికే సేకరించారు. సీనియార్టీ, రిక్వెస్ట్, ఒకే చోట ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో మొత్తం 195మంది ఉద్యోగులు ఉండగా 41మంది ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ స్థాయిలో ఏపీడీ ఈశ్వరయ్య, డీపీఎం ఎంకే సత్యనారాయణ, రాయదుర్గం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్‌లకు ఐదేళ్లు పూర్తికావడంతో బదిలీ కావాల్సి ఉంది. ఇక ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఏపీఎంలు ఉరవకొండ గంగన్న, బీమా సెంటర్ హరిప్రసాద్, లైవ్లీహుడ్స్ శ్రీనివాసులు, శింగనమల నారాయణస్వామి, పామిడి అరుణ, శెట్టూరు సర్దానప్ప, వజ్రకరూరు గుణశ్యామ్, ఆత్మకూరు మదన్‌మోహన్‌లు తప్పక బదిలీ చేయాల్సిందే. వీరితో పాటు ముగ్గురు డీపీఎం లు, ఏపీఎంలు మరో ఏడుగురు, సీసీలు 28 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 253మంది ఉద్యోగులు ఉండగా 47మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఏపీఎంలు చిలమత్తూరు భారతమ్మ, గోరంట్ల నారాయణ, అమరాపురం బీటీ తిప్పన్నలకు ఐదేళ్ల కాలం పూర్తి అయ్యింది. వీరు తప్పక బదిలీ కావాలి. వీరితో పాటు మరో 16మంది ఏపీఎంలు, 36మంది సీసీలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల్లో శ్రీసత్యసాయి జిల్లా పీడీ నరసయ్యతో చర్చించి బదిలీలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈనెల 31న బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని, ఒకటిన బదిలీ అయిన స్థానంలో విధుల్లో చేరాల్సి ఉందని పీడీ తెలిపారు.

దులీప్‌ట్రోఫీ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: దులీప్‌ట్రోఫీ-2024 నిర్వహణ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నియమించారు. వైస్‌చైర్మన్‌గా లార్డ్ ప్రకాష్‌రెడ్డి, సెక్రటరీగా మాజీ క్రికెటర్ షాబుద్దీన్, కన్వీనర్‌గా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులుగా ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏసీఏ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్, పగడాల మల్లికార్జున, మాజీ ఉపాధ్యక్షుడు జొన్నా జయప్రకాష్, ఏసీఏ కోచ్ యుగంధర్‌రెడ్డి నియమితులయ్యారు. పిచ్ ఏర్పాటుకు సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో బీసీసీఐ క్యూరేటర్ సమంధర్ సింగ్ భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. లైవ్ టెలికాస్ట్‌కు అవసరమైన టవర్లను నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5నుంచి 23వరకు దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. జిల్లా క్రికెట్ చరిత్రలో బ్రాడ్‌కాస్టింగ్ రూం ఏర్పాటు చేయడంలో బీసీసీఐ చొరవ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతి ఒక్కరికీ ఉచితంగా పాసులు అందజేస్తామని, క్రికెట్ అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. క్రికెట్ దిగ్గజాలు ఈ పోటీల్లో పాల్గొననుండటంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు పాటించి, పిచ్ ఏర్పాటు, ఇతర సదుపాయాలు, భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


పిచ్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న బీసీసీఐ క్యూరేటర్ సమందర్‌సింగ్, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు



బంగారం కొనబడును

Ph. 7382114647
AJA-198062

WANTED
Freshco Goli Soda కు అనంతపురం జిల్లా అంతటా డిస్ట్రిబ్యూటర్లు, సూపర్ స్టాకిస్టులు, డీలర్లు, ఫ్రాంచైజీలు కావలెను. సంప్రదించండి Ph:9642965474
AJA-198061

WANTED
9948994324
ATP - AJ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలపై ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సేల్స్ రంగంలో రాణించాలనుకుంటున్నారా?



అయితే ఆంధ్రజ్యోతి మీకు మంచి అవకాశం కల్పిస్తుంది మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే
ఆసక్తి, ఉత్సాహముగల అభ్యర్థులకు సేల్స్ రంగంలో... మెళకువలు నేర్పేందుకు తగిన శిక్షణ ఇవ్వబడును.
- బుక్ చేసిన కాపీ ఒక్కింటికి రూ. 200/- చొప్పున కమీషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.
- ప్రయాణపు ఖర్చులు అదనంగా ఇవ్వబడును.

29-8-2024 తేదీన ఉదయం10:00 గంటలనుండి 02:00 గంటలలోపు హాజరు కాగలరు.
గమనిక: ఆసక్తి కలవారు బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

అర్హతలు :
1. వయస్సు: 19-25 సంవత్సరాల యువకులు మాత్రమే.
2. తెలుగులో అనర్గళంగా మాట్లాడగలగాలి.
3. విద్యార్హత: ఎస్.ఎస్.సి ఆపైన

అనంతపురం
డి.సి.యమ్.ఎస్.రోడ్, కమలా నగర్, అనంతపురం, 9985411608.
టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, తాడిపత్రి 9666204042.
పాతగేట్స్ హైస్కూల్ దగ్గర సీఎం ఆఫీసర్స్ పైన, గుంతకల్లు 9985411657.

శ్రీ సత్యసాయి జిల్లా
ప్రెస్‌క్లబ్, 1టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, హిందూపురం 9985445760.
కదిరి గేట్, ధర్మవరం 9963160529
మారుతి కాంప్లెక్స్ ఆర్.యస్.రోడ్, కదిరి 9052518170.

టమోటాను వృథాగా పడేయవద్దు


మార్కెట్‌లో టమోటా దిగుబడిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

అనంతపురంరూరల్, ఆగస్టు 26: నోసేల్ కింద టమోటాను వృథాగా పడేయవద్దని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సూచించారు. సోమవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌ను ఆయన సందర్శించారు. రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. మార్కెట్‌కు ఎంత టమోటా వస్తోంది? ఇక్కడి నుంచి ఎక్కడకు పంపిస్తున్నారు? ఒక్కో బాక్స్ ఎంత ధరకు పలుకుతోంది? ధరలు, కమీషన్ ఇతరాత్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. టమోటా నోసేల్ పడేందుకు కారణమేంటని ప్రశ్నించారు. వర్షాల వల్ల మచ్చలు రావడంతో పంట కొనుగోలు చేయలేదని వ్యాపారులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ టమోటాను రోడ్ల పక్కన పడవేయరాదన్నారు. దగ్గర్లోని డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వీలైతే పశువులకు, గొర్రెలకు ఆహారంగా అందించాలన్నారు. నాణ్యమైన పంటకు మంచి ధరలు అందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు కమీషన్‌పై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్, మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే అభినందన


కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 26: మన టీడీపీ యాప్ ద్వారా విస్తృతస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లిన కార్యకర్తలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభినందించారు. సోమవారం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ అభినందన లేఖలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి అందజేసి అభినందించారు. పార్టీ కోసం కష్టపడితే గుర్తుంపు వస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

విద్యార్థి హర్షవర్ధన్‌కు..: టీడీపీ యాప్ ద్వారా ప్రజలలోని తీసుకుని వెళ్లిన జడ్పీ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్‌ను ఆ పార్టీ నాయకులు అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో బండారు లీలావతి, తెలుగు యవత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఉన్నారు.

చోరీలను నియంత్రించండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఆగస్టు 26: దొంగతనాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఎలా మాట్లాడుతున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ చాంబర్, లాకప్ గది, రైటర్ గది, క్రై ంచార్టులను నిశితంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో కేసులపై సీఐ ఎస్పీకి వివరించారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సీఐ సాయినాథ్, ఎస్ఐ నాగమధు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్పలలో దొంగల హల్‌చల్

● ఆరు తులాల బంగారు, రూ.1.80 లక్షలు చోరీ


డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

నార్పల, ఆగస్టు 26: మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను కాలనీలో ఆదివారం రాత్రి దొంగలు ఓ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన పులుసులనూతుల రాముడు కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువా తలుపులు రాడ్లతో తొలగించి రూ.1.80లక్షలు, ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. శుభకార్యానికి వెళ్లిన కుటుంబికులు ఇంటికి తిరిగి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. డాగ్‌స్క్వాడ్ దిగుమరి రోడ్డు పరిసర ప్రాంతాల్లో తిరిగాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దొంగల అరెస్ట్

ఆత్మకూరు, ఆగస్టు 26: పెళ్లి వేడుకలు ముగించుకుని బస్సులో స్వగ్రామాలకు వెళుతున్న ఇద్దరు మహిళల నుంచి 6 తులాలు బంగారు చైన్లను అపహరించిన దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్ నాయక్ తెలిపారు. పెద్దవడూగూరు మండలం చంద్రగిరికి చెందిన శ్రీదేవి, కనగాపల్లికి చెందిన నాగలక్ష్మి కళ్యాణదుర్గం నుంచి అనంతపురం బస్సులో ప్రయాణిస్తుండగా బస్సులో అప్పటికే ఉన్న నలుగురు మహిళా దొంగలు చాకచక్యంగా వారి బాగ్యుల్లో ఉన్న రెండు బంగారు చైన్లను దొంగిలించారు. కనగానపల్లికి చెందిన నాగలక్ష్మి ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సు దిగి బ్యాగ్ తెరిచి చూడగా బంగారు చైన్లు కనిపించకపోవడంతో నివ్వెరపోయింది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు విచారించి ఆటోలో పారిపోతున్న దొంగలను వడ్డిపల్లి టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగలను విచారించగా ఆరు తులాలు ఉన్న రెండ్లు చైన్లు అపహరించినట్లు నేరం ఒప్పుకున్నారన్నారు. దీంతో రెండు బంగారు చైన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 26: నగరంలో ఓ యువతి గతనెలలో అదృశ్యమైంది. తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడిమర్రి మండలం మరువపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి నగరంలోని గ్లోబల్ ఇంటర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 22న ఓ యువకుడు వచ్చి తన చెల్లెలు అని చెప్పి పిలుచుకెళ్లాడు. తల్లిదండ్రులు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తరిమెలలో మహిళ..

శింగనమల, ఆగస్టు 26: మండలంలోని తరిమెల గ్రామంలో వరలక్ష్మి అనే మహిళ అదృశ్యం. తరిమెల గ్రామానికి చెందిన వరలక్ష్మి, రామాంజనేయులు దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం కుటుంబంలో చిన్నపాటి తగదాతో వరలక్ష్మి ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు భర్త సోమవారం శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు ఆచూకీ దొరికిన వారు 9502604521, 9618924819 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రైలు ఢీకొని రైతు మృతి

గుత్తి, ఆగస్టు 26: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని ఉప్పర్లపల్లి, పగిడిరాయి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని పెద్ద పాపన్న(54) అనే రైతు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండ లం జొన్నగిరికి గ్రామానికి చెందిన పెద్దపాపన్న సోమవారం తన పొలానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి బయలుదేరి మార్గంమధ్యలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృ తి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

ముకుందా... ముకుందా...

జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంతోపాటు, మండలాల్లోని శ్రీకృష్ణ దేవాలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో చిన్నారులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. - న్యూస్ నెట్‌వర్క్


రామగిరిలో అలంకరణలో శ్రీకృష్ణుని ప్రతిమ


వేణుగోపాల్‌నగర్‌లో పూజలందుకుంటున్న నల్లనయ్య


అరవిందనగర్‌లో త్రైతసిద్ధాంత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు


చెన్నేకొత్తపల్లిలో...


నవభారత్ స్కూల్‌లో...


కార్యక్రమాలు నిర్వహిస్తున్న భావసారక్షత్రియులు


రామ్‌నగర్ రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో చిన్నారుల సంప్రదాయ నృత్యాలు


ఇస్కాన్ మందిరంలో పూజల్లో పాల్గొన్న షిర్డిసాయి స్వీట్స్ ప్రొప్రైటర్ శివకుమార్ దంపతులు


అనంతపురం రూరల్ శిల్పారామంలో...


అనంతలక్ష్మి స్కూల్‌లో...


గార్లదిన్నెలో...


శ్రీకృష్ణుడి వేషధారణలో ముద్దులొలికే చిన్నారి...







నగరంలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు


రాప్తాడులో...

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


నూతనంగా నిర్మించిన కొల్లాపురమ్మ ఆలయం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 26: మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత కొల్లాపురమ్మ విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పురాతన ఆలయం స్థానంలో గ్రామ ప్రజలు, దాతలు సహకారంతో నూతన దేవాలయాన్ని నిర్మించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న గణపతిపూజతో ప్రారంభమై అభిషేకాలు, హోమా లు జరుగుతాయన్నారు. 29న గ్రామోత్సవం, హోమాలు ఉంటాయన్నారు. 30న గ్రామదేవత కొల్లాపురమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. పెద్ద ఎత్తున అన్నదానకార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

రోడ్డు మధ్యన విద్యుత్ స్తంభాలు

● సమస్యను పరిష్కరించిన టీడీపీ నాయకులు


రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను మారుస్తున్న విద్యుత్ సిబ్బంది

అనంతపురం రూరల్, ఆగస్టు 26: మండలం కక్కలపల్లి పంచాయతీ ప్రజాశక్తినగర్‌లోని ఓ వీధిలో గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మధ్యలో నాలుగు విద్యుత్ స్తంభాలు నాటించారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను టీడీపీ గ్రామ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, స్థానిక నాయకులు ఎమ్మెల్యే పరిటాలసునీతకు సమస్యను వివరించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. వెంటనే ఆ విద్యుత్ స్తంభాలను మార్పివేయించారు. నాయకులు బండి నరసింహులు, డీలర్ జూటూరు వెంకటేష్, మసూద్, అన్వర్‌బాషా, బూత్ కన్వీనర్ నగేష్, బాబాఫక్రుద్దీన్, శంకర్‌రెడ్డి ఆదినారాయణ, బుజ్జి, బాషా పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం


ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురంరూరల్, ఆగస్టు 26: నగర శివారులోని పీవీకేకేఐటీలో ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం(ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూ కళాశాల డా. విజయక్‌కుమార్ హాజరయ్యారు. విద్యుత్ వాహనాల సాంకేతికత భవిష్యత్తులో ఎంతటి పాత్ర పోషిస్తాయన్న విషయాలను వివరించారు. మోహన్‌బాబు యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ప్రభు విద్యుత్ వాహనాల సాంకేతికతలో తాజా పరిజ్ఞానాన్ని విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు పరియయం చేయడానికి, పరిశ్రమలలోని నూతన పరిణామాలను తెలుసుకోవడానికి మంచి వేదికన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ డా. శివనాగరాజు విద్యుత్ వాహనాల టెక్నాలజీపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండిరమేష్‌బాబు, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఏటి మనోహర్‌రెడ్డి, ఎఫ్‌డీపీ కన్వీనర్ శ్రీనివాసన్, కో-కన్వీనర్ హరిప్రసాద్, ఆర్గానైజింగ్ కార్యదర్శి మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు

నార్పల, ఆగస్టు 26: ఖరీఫ్-2024 సీజన్‌లో ఇంతవరకు పంటలు సాగు చేయని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు 80శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి చిన్నవీర స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ దగ్గరలోని రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించి పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను సమర్పించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న రైతులకు నాలుగు రోజులలో విత్తనాన్ని సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో ఉలవ పంట సాగుచేసే రైతులు బుధవారం నుంచి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

హాస్టల్ విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

అనంతపురం అర్బన్, ఆగస్టు 26: నగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థి తేజ మృతిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి తేజ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

వినాయక ఉత్సవ మండపానికి భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 26: జిల్లాకేంద్రంలో నగర పాలకసంస్థ కార్యాలయం ముందు వినాయక చవితి ఉత్సవ మండపానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 42వ వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబరు 7 నుంచి 11వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. పరుచూరు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి నగరపాలకసంస్థ మేయర్ మహ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరై పూజ ల్లో పాల్గొన్నారు. రుత్వికుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూ జలు నిర్వహించడంతోపాటు పతాకావిష్కరణ గావించారు. ఉత్సవ సమి తి గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌స్వామి, వేణుగోపాల్, చిరంజీవిరెడ్డి, జీఎన్ఎస్ లలిత, మల్లికార్జున పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వడ్డే రాజేష్


రాజేష్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26: మైన్స్ లీజు కాంట్రాక్టర్ వడ్డే రాజేష్ బీజేపీలో చేరారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు సమక్షంలో రాజేష్‌తో పాటు యువతకు కండువా చేసి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని, మైన్స్ క్వారీలలో రిజర్వేషన్ ఆధారంగా ప్రాధాన్యం కల్పించాలని రాజేష్ కోరారు. వడ్డెర్లకు పనిముట్లు, బోర్‌వెల్స్ వాహనాలు సబ్సిడీతో అందజేయాలని, రాజకీయంగా చట్టసభల్లో అవకాశం కల్పించాలన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ లలిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కుంచెపు గంగాధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

చదువే అన్ని సమస్యలకు పరిష్కారం

● ప్రతిభా పురస్కార ప్రదాన సభలో వక్తలు


పురస్కారాలతో విద్యార్థులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 26: చదువొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమని పలువురు వక్తలు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నక్కా రామారావు యాదవ చారిటబుల్ ట్రస్టు, యాదవ ఉద్యోగ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని నక్కా రామారావు యాదవభవనంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన 100 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ట్రస్టు చైర్మన్ పోతుల నాగరాజు, న్యాయవాది రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. యాదవ విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, నలుగురికీ సహాయ సహకారాలందించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. యాదవ విద్యార్థులకోసం ప్రపంచ సమాచారం అందించేందుకు తమ ట్రస్టు ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, ఐఏఎస్, ఏపీఎస్ కోచింగ్‌లకు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలతోపాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నాగభూషణం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, చంద్రమోహన్, నరసింహులు, నాగేశ్వరరావు, నాగేశ్వరి, నారాయణస్వామి, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, మారుతి, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

విజయవాడలో రేపు భూబాధితుల రాష్ట్ర సదస్సు

అనంతపురం విద్య, ఆగస్టు 26: భూబాధితుల రాష్ట్ర సదస్సు బుధవారం విజయవాడలో నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకులు భూ దాహానికి ఎంతో మంది పేదలు బలైపోయారన్నారు. ఎస్సీఎస్టీలకు సంబంధించిన భూములు, చుక్కల భూములు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి దూర ప్రాంతాల్లో ఉన్నవారి భూములను వైసీపీలో పలుకుబడి ఉన్న రాజకీయ పెద్దలు ఆక్రమించేశారన్నారు. 28న జరిగే రాష్ట్ర సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి రమణ, అల్లిపీరా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కృష్ణుడు, నారాయణస్వామి, శ్రీనివాస్, బంగారు బాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శింగనమల: భూబాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, సీపీఐ కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బుధవారం విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న భూకబ్జాలు, కుంభకోణాలపై భూ బాధితుల సదస్సు నిర్వహిస్తునామన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మధు యాదవ్, మునిస్వామి, నేసే మధు, వెంకటరెడ్డి, నారప్ప పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొనసాగుతున్న తాగునీటి కార్మికుల సమ్మె

● నల్లబ్యాడ్జీలతో నిరసన

గార్లదిన్నె, ఆగస్టు 26: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఐదోరోజుకు చేరుకుంది. కల్లూరు పంపుహౌస్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో వేలాది మంది ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. నాగభూషణం, మల్లరాయుడు, సాంబశివ, శ్రీనివాసులు, బాషా, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరానికి స్పందన

రామగిరి, ఆగస్టు 26: మండల కేంద్రంలోని షిర్డీసాయి విద్యానికేతన్ స్కూల్ ఆధ్వర్యంలో అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రి సహకారంతో సోమవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. 100 మందికిపైగా గుండెకు సంబంధించిన రోగులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. నలుగురిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. వచ్చిన వారికి వైద్యసేవలు అందించి సూచనలు, సలహాలు అందించారు. డాక్టర్ రమణ, ఆస్పత్రి సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ ముత్యాల్‌చౌదరి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై కొట్నూరు రామాంజినేయులు S/o కొట్నూరు ఈశ్వరయ్య D.No:4-2-764-56, జనశక్తినగర్, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం నగర పాలక సంస్థ ఏరియా పరిధిలోని సర్వేనెం.78-2లో D.No.4-2-764-56 ఇల్లు.

చెక్కుబంది:-తూర్పు:ప్లాట్‌నెం.366లోని ఇల్లు,పడమర:15అ॥ల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం:ప్లాట్‌నెం.354లోనిఇల్లు, దక్షిణం: ప్లాట్‌నెం.356లోని ఇల్లు.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన


ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై జగ్గాల భారతి W/o జగ్గాల సర్వేష్ D.No:1-96, కల్లుమడి గ్రామం, శింగనమల మండలం అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ పామిడి సబ్ రి॥డి॥కి చేరిన శింగనమల మండలం కల్లుమడి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనెం.381లో భూమి వివరం.

చెక్కుబంది:-తూర్పు: బండిరస్తా, పడమర: అప్పిరెడ్డి ప్లాటు, ఉత్తరం: నేసే చౌడప్ప ప్లాటు, దక్షిణం:అంగనవాడి భవనం.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907


గుంతకల్లులో ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడి మూలవిరాట్


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్


తాడిపత్రిలో గొల్లపాలెం ఆలయంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

పాహిమాం.. ముకుందా..

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణ మందిరాలు, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ మందిరాలు, వేణుగోపాల స్వామి ఆలయాలతో పాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొన్ని గ్రామాల్లో ఉత్సవమూర్తిని, స్వామి చిత్రపటాన్ని పల్లకీలో కొలువుదీర్చి పురవీధుల్లో భజనలు చేస్తూ.. ఊరేగించారు. పలుచోట్ల యాదవులు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మండపాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి వేడుకలు జరిపారు. అదేవిధంగా పలు ప్రైవేటు పాఠశాల్లో వేడుకల్లో భాగంగా పలువురు చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలలో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గుంతకల్లు పట్టణంలోని శ్రీకృష్ణాలయంలో స్వామివారిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ తదితరులు దర్శించుకున్నారు. పామిడిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. అక్కడి శ్రీకృష్ణాలయంలో స్వామిని దర్శించి పూజలు చేయించారు. ఇక తాడిపత్రి పట్టణంలోని గొల్లపాలెంలో గల శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామివారిని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.


గుత్తి మండలం శ్రీపురంలో విశేష అలంకరణలో..


ఉరవకొండలో..


కుందుర్పి మండలం కదరంపల్లిలో ..


పామిడిలో పట్టణంలో..


యాడికిలోని వివేకానంద హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు


కళ్యాణదుర్గం వివేకానంద పబ్లిక్ స్కూల్లో వేడుకలు


విడపనకల్లు మండలం గడేకల్లులో.., యాడికిలో..


కణేకల్లులోని అయోధ్య పాఠశాలలో..


డీ.హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలోని బాలమేధావి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో..


గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఘనంగా మదర్ థెరిసా జయంతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 26: మదర్ థెరిసా జయంతిని పట్టణంలోని జేవీవీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు జయవర్ధన్‌రెడ్డి, జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగరాజు ముఖ్యఅతిథులుగా హాజరై స్థానిక టీవీ స్టేషన్ వద్ద ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మదర్ థెరిసా ఎందరో అభాగ్యులు, పేదలు, రోగులకు అనేక సేవలందించారని గుర్తు చేశారు. అనేక అనాథ శరణాలయాలు, ధర్మశాలలు ఏర్పాటు చేశారని కొనియాడారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఇన్ఫినిటీ ట్రస్టు కార్యాలయంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ మదర్ థెరాస్సా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చిక్కణ్ణేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు

కణేకల్లు, ఆగస్టు 26: మండల కేంద్రంలో చిక్కణ్ణేశ్వరస్వామి పల్లకి ఊరేగింపును సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి దిగువగేరి వరకు చిక్కణ్ణేశ్వరస్వామితో పాటు సిద్ధప్పస్వామిని కూడా పల్లకిలో ఊరేగించారు. శ్రావణ నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మారెమ్మకు జలధి పూజ

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 26: మండలంలోని బసంపల్లిలోని మారెమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం శెట్టూరు సమీపంలో ఉన్న నోముగడ్డ వంక దగ్గరకు వెళ్లి జలధిపూజను ఘనంగా నిర్వహించారు. తొలుత గంగపూజ చేశారు. అనంతరం జలధి నిర్వహించారు. తర్వాత పురవీధుల గుండా ఊరేగిస్తూ ఉత్సవ విగ్రహాన్ని బసంపల్లిలోని వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జలధి పూజలో మారెమ్మదేవి ఉత్సవ విగ్రహం

3న దుగ్గిలమ్మ జాతర

రాయదుర్గం రూరల్, ఆగస్టు 26: పట్టణంలోని మధు సినిమా థియేటర్ సమీపంలో వెలసిన దుగ్గిలమ్మ ఆలయంలో సెప్టెంబరు 3వ తేదీన జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు సవిత, వత్సల అశ్వత్, సావిత్రి పాటిల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి యేడాది శ్రావణ మాసం ముగిసిన వెంటనే దుగ్గిలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులోభాగంగా ఈ సారి జరపనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రైవేట్ పాఠశాలల యజమానులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 26: నియోజకవర్గంలోని ప్రైవేట్ స్కూళ్ల యజమానులు సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును రాయదుర్గం పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైతు మృతి

గుత్తి, ఆగస్టు 26: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని ఉప్పర్లపల్లి, పగిడిరాయి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని పెద్ద పాపన్న(54) అనే రైతు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి గ్రామానికి చెందిన పెద్దపాపన్న సోమవారం తన పొలానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి బయలుదేరి మార్గంమధ్యలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 26: శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన హరిజన బాబు (21) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారమూ గొడవపడి మనస్థాపానికి గురై గ్రామ సమీపంలో చెట్టుకు లుంగీతో ఉరివేసుకుని మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

1నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 26: సెప్టెంబరు ఒకటవ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణాధ్యక్షుడు వడ్డె రమేష్ తెలిపారు. పట్టణంలోని గోపాలకృష్ణ భవనంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందా లంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పట్టణంలో చేపట్టే పార్టీ సభ్యత్వ నమోదును పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొలమి రామాంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి జేసీ వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వెంకటరాఘవం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో త్వరలో గ్రామసభలు

గుత్తి, ఆగస్టు 26: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతిగ్రామంలోనూ త్వరలో జనసేన ఆధ్వర్యంలో త్వరలో గ్రామసభలను నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు వాసిగిరి మణికంఠ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 13,726 గ్రామసభలు నిర్వహించి దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. సర్పంచుల ఆధ్వర్యంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నాంది పలకడం హర్షించదగ్గ విషయమన్నారు. త్వరలో ఊరురా గ్రీన్ ఆంధ్ర పేరిట సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ, మండల అధ్యక్షులు పాలిట్ సురేస్, చిన్నవెంకటేశులు, నాయకులు బోయగడ్డబ్రహ్మయ్య, వెంకటపతి, ఓబులేసు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన సమ్మె

గుత్తి, ఆగస్టు 26: సమస్యలను పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి పంప్ హౌస్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఆరో రోజుకు చేరింది. పట్టణంలోని పంప్ హౌస్ వద్ద కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. తమకు ఆరు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు అతావుల్లా, రాజేష్, రాము పాల్గొన్నారు.

చంద్రబాబు చేతల ముఖ్యమంత్రి

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ● మూడు నూతన ఆర్టీసీ బస్సుల ప్రారంభం


గుంకల్లులో ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


తాడిపత్రిలో బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

గుంతకల్లు, ఆగస్టు 26: ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ చంద్రబాబు నాయుడు చేతల ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోకు వచ్చిన మూడు నూతన బస్సులను సోమవారం ఉదయం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోపే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారని అన్నారు. అలాగే ఎన్నికల్లో చెప్పిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పుడు ఆర్టీసీకి 1500 కొత్త బస్సులను సమకూర్చారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ.. చంద్రబాబు తన మార్కు పరిపాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని అన్నారు. వచ్చిన కొత్త బస్సుల్లో రెండింటిని అనంతపురం-గుంతకల్లు రూటులోను, ఒక బస్సును గుంతకల్లు-తిరుపతి రూటులోను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, గుజరీ మహమ్మద్ ఖాజా, న్యాయవాది హేమాద్రి, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, యూసుఫ్ ఖాన్, పెంచలపాడు వెంకటేశులు పాల్గొన్నారు.

రెండు బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే అశ్మిత్

తాడిపత్రి: పట్టణంలోని ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు నూతన బస్సులను సోమవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. బస్సులకు రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సు లోపలికి వెళ్లి సీట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు సంస్థను లాభాల బాట పట్టించాలని సూచించారు. త్వరలో మరిన్ని బస్సులు వచ్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. అంతకుమునుపు బస్టాండ్ మొత్తం ఎమ్మెల్యే కలియతిరిగి సమస్యలపై ఆరా తీశారు. నూతనంగా మంజూరైన రెండుబస్సుల్లో సూపర్ లగ్జరీ సర్వీసును బెంగళూరుకు, ఎక్స్‌ప్రెస్ బస్సును అనంతపురం, కడపకు నడపనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట డిపో అసిస్టెంట్ మేనేజర్ నందిని, అసిస్టెంట్ ఇంజనీర్ మాధవి, యూనియన్ నాయకులు ప్రతాప్‌నారాయణ, ఆదినారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మెయిన్ బజారులో పర్యటన

పట్టణంలోని మెయిన్‌బజారులో సాయంత్రం సమయంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలు వ్యాపారులను పలకరిస్తూ వ్యాపారం ఎలా ఉందంటూ ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లిన ఆయన తాగునీరు, అండర్ డ్రైనేజీ నిర్వహణపై మహిళలను ఆరాతీశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం, నాయకులు రంగనాథరెడ్డి, విజ్జి, సుదర్శన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 26: తాలూకా వ్యాప్తంగా గత వారంరోజుల క్రితం భారీ వర్షం కురవడంతో పంటలకు నష్టం వాటిల్లిందని, దీంతో నష్టపోయిన ప్రతిరైతును ఆదుకోవాలని సీపీఐ నాయకులు కొట్రేష్, దుర్గన్న, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కెంచానపల్లి, కాశీపురం, బొమ్మక్కపల్లి, మల్లాపురం, కదరంపల్లి, మల్కాపురం గ్రామాల్లో పలు పంటలను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విరివిగా టమోట, మొక్కజొన్న సాగుచేశారని, వారం క్రితం భారీ వర్షం రావడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. నష్టపోయిన ప్రతిరైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాయకులు నరసింహులు, కుమార్, అంజి, దివాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు 26: పట్టణంలోని నందలపాడుకు చెందిన హమాలీ సుదర్శన్ (35) సోమవారం ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపా రు. సుదర్శన్ ట్రాక్టర్ ట్రాలీలో నిలబడి ఉండగా.. డ్రైవర్ ఓబులేసు ట్రాక్టర్‌ను కదిలించాడని, దీంతో పట్టు తప్పిన అతను ప్రమాదవశాత్తూ టైరు కింద పడి మృతిచెందాడని తెలిపారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్టోరేజ్ ట్యాంక్, పంపుహౌస్ పనులకు భూమిపూజ

డీ.హీరేహాళ్, ఆగస్టు 26: మండలకేంద్రంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకానికి సంబంధించి స్టోరేజ్ ట్యాంక్, పంప్‌హౌస్ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. అంబేడ్కర్‌కాలనీ సమీపంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికృష్ణనాయక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు భూమి పూజ చేశారు. నాగళ్లి రాజు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి మంచినీటి పథకం ద్వారా పలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి మంచినీటిని అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. సుమారు 8 గ్రామాలకు నీటిని అందించడంలో భాగంగా ఇక్కడ 90 వేల లీటర్ల సామర్థ్యంతో స్టోరేజ్‌ట్యాం క్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ పనులను మూడునెలల్లోనే పనులు పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫలాల అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్, ఆగస్టు 26: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ప్రధానఅర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు వేకువజామునే స్వామివారికి అభిషేకాలు, పలు రకాల ఫలాలతో అలంకరణ చేశారు. అనంతరం గోపూజ, వాసుదేవ పుణ్యాహవాచనము, పంచగవ్య మేళనం, ప్రధాన దేవతల కలశస్థాపన, మండప ఆరాధన జరిపించారు. సుందరకాండ పారాయణం, జపమాల, మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించిన అనంతరం మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, అటెంబర్ ఓబన్న పాల్గొన్నారు.


పలు ఫలాల అలంకరణలో ఆంజనేయస్వామి

ఆలూరుకోనలో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, ఆగస్టు 26: మండలంలోని ఆలూరుకోనలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదేవిభూదేవి సమేత ఆలూరు రంగనాథస్వామి మూలవిరాట్‌కు ఉదయాన్నే అర్చకులు పలు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


విశేషాలంకరణలో అమ్మవార్ల సమేత రంగనాథ స్వామి

నేటి నుంచి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

కణేకల్లు, ఆగస్టు 26: ఖరీఫ్‌సీజన్‌లో ఇప్పటి వరకు ఎలాంటి పంటలు సాగుచేయని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను అందజేయనున్నట్లు ఏఓ శ్రావణ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉలవలు, పెసర, ఆలసంద, కంది విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు ఎర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని ప్రత్యామ్నాయ విత్తనాలను పొందవచ్చని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాయదుర్గంరూరల్, ఆగస్టు 26: ఎలాంటి అనుమతుల లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి సీఐ వెంకటరమణ తెలిపారు. రైల్వేగేట్ సమీపంలో సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వద్ద వేదావతి హగరి వద్ద నుంచి రాయదుర్గానికి ఇసుకను తరలిస్తుండడంతో పట్టుకుని తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ప్రజావేదిక

తాడిపత్రి, ఆగస్టు 26: పట్టంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై ఈనెల 15నుంచి 26వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారని, ఆ తనిఖీ వివరాలు వెల్లడించేందుకు ప్రజావేదిక ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు.

రహదారికి మరమ్మతులు చేపడతాం

పామిడి, ఆగస్టు 26: మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన రోడ్డు కోతకు గురవడంతో వెంటనే మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. రామగిరి గ్రామ రహదారి ఇటీవల వర్షపు నీటి ఉధృతికి పలుచోట్ల కోతకు గురైన విషయం తెలిసిందే. ఆ రహదారిని సోమవారం ఆయన పరిశీలించారు. సంబంధితాధికారులతో వెంటనే మరమ్మతులు చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజల సౌకర్యం కోసం తాత్కాలిక రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌ఆర్ రమేష్, బొమ్మా మోహన్‌కృష్ణ, హమాలీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మార్ట్‌లో చోరీ

గుత్తి, ఆగస్టు 26 : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులోని సెమ్‌రిన్ స్టీల్స్ ఐరన్ మార్ట్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు ఐరన్ మార్ట్ పైకప్పునకు రంధ్రం వేసి లోపలకి చొరబడ్డారని, అక్కడ క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.15వేల నగదుతో పాటు విలువైన వస్తువులు అపహరించుకెళ్లారని మార్ట్ నిర్వాహకుడు జమీల్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా లోపల అమర్చిన సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై M.రాజ్‌కుమార్ S/o M.జయరాజ్ D.No.3-4A, తూముచెర్ల గ్రామం, కనగానపల్లి మండలం, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తక రార్లు ఉన్న యెడల 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రి॥డి॥ చెన్నెకొత్తపల్లి సబ్ రి॥డి॥కి చేరిన కనగానపల్లి మండల తూముచెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం.329/11లో డో.నెం.3-31 ఇల్లు.
చెక్కుబంది:-తూర్పు: రస్తా, పడమర: రామన్న ఇల్లు,ఉత్తరం:ఎమ్.బాలరాజు ఇల్లు, దక్షిణం:ఎమ్.పెద్ద మునిస్వామి ఇల్లు.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై ఇజ్రాయిల్ హెలెన్ కుమారి W/o తెమ్మి ఇజ్రాయిల్, D.No:11-710, ఓబుళదేవనగర్, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తక రార్లు ఉన్న యెడల 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ పామిడి సబ్ రి॥డి॥కి చేరిన పామిడి మండలం కేంద్రలోని సర్వేనెం.367/1Aలో 12.5 సెంట్లు.
చెక్కుబంది:-తూర్పు: ఇదే సర్వెనె.లో జి.శాంతకుమారికి నేను విక్రయించిన భూమి, పడమర:సర్వేనెం.364భూమి, ఉత్తరం: మహమ్మద్ ఖాశీం భూమి, దక్షిణం: ఇదే సర్వె.నెంలో నాయొక్క మిగులు భూమి.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై గండికోట అశ్వర్థ నారాయణ బాబు S/o లేట్ జి.లింగప్ప, బుక్కపట్నం గ్రామం&మండలం, శ్రీ సత్యసాయి జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తక రార్లు ఉన్న యెడల 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ బుక్కపట్నం సబ్ రి॥డి॥కి చేరిన బుక్కపట్నం మండల కేంద్రం లోని సర్వేనెం.705-1లో 55 సెంట్ల భూమి .
చెక్కుబంది:-తూర్పు: కమ్మక్క గారి నాగభూషణం వగైరా జమీను, పడమర: రస్తా, ఉత్తరం: డా॥ అనందీశ్వరయ్య వగైరా జమీను, దక్షిణం:గుర్రం నాగప్ప వగైరాల జమీను.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు కె.యమ్.హేమలత W/o కె.యమ్.మురళీ, అను పేరున గల ఆస్తి తాకట్టుపై కె.యమ్.శివమారుతి S/o కె.యమ్.మురళీ, D.No.28-797, బోయవీధి, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తక రార్లు ఉన్న యెడల 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ గుత్తి సబ్ రి॥డి॥కి చేరిన గుత్తి మండలం గుత్తిఅనంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం.94లో ప్లాట్ నెం.218 & 219.
చెక్కుబంది:-తూర్పు: ప్లాట్ నెం.220, పడమర: ప్లాట్ నెం.217, ఉత్తరం: ప్లాట్ నెం. 197 & 198, దక్షిణం: 20 అడుగుల రస్తా.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907